అనుదినం జనహితం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
గురువారం 29 జూన్ 2023

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



పురుషాధిక్య సమాజంలో మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి అన్నారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీతా లక్ష్మారెడ్డి అధ్యక్షతన సెమినార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమ్ర ఈశ్వరిబాయి మాట్లాడుతూ ఏజెన్సీ ఆదివాసీ మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. మహిళలు విద్యా వైద్యం తదితర రంగాల్లో రాణించాలని కోరారు.

కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బిఆర్ఎస్ సీనియర్ కార్యకర్త నవాతే శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే జోగు రామన్న బుధవారం పరామర్శించారు. పట్టణంలోని హ్యాండ్ క్యాప్ కాలనీలో బాధితుడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ పట్టణ అధ్యక్షులు అజయ్, అష్రాఫ్, దుర్గం శేఖర్ ఉన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యల పరిష్కారం కోసం దివ్యాంగుల న్యాయ పోరాటం కొనసాగుతోంది. జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలేదీక్షలు బుధవారం 134వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం ప్రభుత్వం నుండిగానీ, అధికారుల నుండిగానీ, ప్రజాప్రతినిధుల నుండి గానీ స్పందన లేకపోవడంతో ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివెళ్లి ముట్టడించారు. గతంలో ఎమ్మెల్యే జోగు రామన్న దివ్యాంగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు ఎండి. ఇమ్రాన్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలని ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్నామన్నారు. ముఖ్యంగా వికలాంగులకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని, అర్హులైనవారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. అప్పటివరకు తమ పోరాటాన్ని ఆపేదిలేదన్నారు.

రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జొన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు వారి అకౌంట్లో డబ్బులు జమ చేయడం లేదని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఆరోపించారు. వెంటనే జొన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడారు. మూడు కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ అధికారులు రైతుల ఖాతాలో జమ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అప్పుడేమో జొన్నలు కొనుగోలు చేయమని ధర్నాలు చేశామన్నారు. ఇప్పుడేమో డబ్బులు వేయడం లేదన్నారు. ప్రతి విషయానికి ధర్నాలు నిరసన తెలిపితే కానీ రైతుల సమస్యలు పరిష్కారం కావా అని మండిపడ్డారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కూలీలకు సకాలంలో డబ్బులు వచ్చేటట్టు చూడాలి



నవతెలంగాణ-నార్నూర్

ఉపాధి హామీలో కూలీలకు సకాలంలో డబ్బులు వచ్చేటట్లు చూడాలని ఉపాధి హామీ అధికారులకు డీఆర్‌డీఓ కిషన్ సూచించారు. బుధవారం గాదిగూడ మండల కేంద్ర రైతువేదికలో రెండో విడత సామాజిక తనికీ ప్రజా వేదికలో మాట్లాడారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ 2020 నుండి 2022 వరకు సాగిన వివిధ పనుల రికార్డులు, మస్టర్, పేమెంట్, కూలీల వివరాలు తనిఖీ చేశారు. సామాజిక తనిఖీ పూర్తి వివరాలు గురువారం ప్రకటిస్తామని ఏపిఓ నితిన్ తెలిపారు. ప్రజావేదికలో అదనపు డీఆర్‌డీఓ రవీందర్ రాథోడ్, ఎంపిపి అడా చంద్రకళ రాజేశ్వర్, జడ్పీటీసీ మెస్రం గంగుబాయి సోము, వైస్ ఎంపిపి యోగేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, టిఎలు, కార్యదర్శులు, కూలీలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-కోటపల్లి

వర్షాకాలంలో వ్యాధులు సంక్రమించకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జనగామ సర్పంచ్ అన్నారు. బుధవారం గ్రామంలో వాడవాడ తిరుగుతూ బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తూ ప్రజలకు తగు సూచనలు చేశాడు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీటిని నిల్వ ఉంచకూడదని తెలిపారు. బోరు నీటిని మాత్రమే తాగాలన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

- సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-తాంసి

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.కిరణ్ అన్నారు. బుధవారం సమ్మె సన్నాహక సదస్సు మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. నాటి నుండి గ్రామపంచాయతీ కార్మికులకు 11వ పిఆర్‌సిని వర్తింపజేయాలని పోరాటాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై జీఓ 48ని తీసుకొచ్చి పాఠశాలల పరిశుభ్రత అదనపు భారం మోపిందన్నారు. కాని వేతనాలను చెల్లించడంలో, ఇతర సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపలేదన్నారు. జివో నెంబర్ 51 తీసుకువచ్చి కార్మికుల పని భద్రతను దూరం చేసి మల్టీపర్పస్ వర్కర్స్‌గా మార్చివేసి పని భారాన్ని పెంచిందన్నారు. కార్మికులకు రెండు లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని ముఖ్యమంత్రి హామీ నిచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పిఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు చెల్లించాలని, 60సంవత్సరాలు నిండిన వారికి ఐదు లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలను కలుపుకొని జూలై 6 నుండి పంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తారని తెలిపారు. ఈ లోపు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొజ్జ ఆశన్న, మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రమోద్, విలాస్, నాయకులు శంకర్, నర్సింగ్, కిరణ్, రాజేందర్, దత్తు, శంకర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

ముందస్తు చర్యలు తీసుకోవాలి

- సమీక్షా సమావేశంలో అధికారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మావలలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణ, సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను పంచాయతీ, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని 468 గ్రామపంచాయతీలలో పారిశుద్య పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి శేగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని సూచించారు. రోడ్లపై వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని, మురికి కాలువలను శుభ్రం చేయాలని తెలిపారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలని, ఇంటి పరిసరాలలో పాడైన టైర్లు, నీటి ట్యాంకులు, బాటిల్స్, రంజన్లు, కూలర్స్, కొబ్బరి బొండంలో నీరు నిల్వ లేకుండా శుభ్రం చేయాలన్నారు. దోమల వలన వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హరితహారంలో భాగంగా జిల్లాలో ఈ సంవత్సరం 25 లక్షల 5వేల మొక్కలు నాటేలా ప్రణాళికలను రూపొందించడం జరిగిందని తెలిపారు. 30 నుండి 8702 ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. రెండవ విడత దళితబంధులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 1100 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. లబ్దిదారుల ఎంపిక, శిక్షణ, అవగాహన కార్యక్రమాలను ఎంపీడీవోల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. జాతీయ జలశక్తి అవార్డుల విభాగంలో ఇటీవల ఉత్తమ మూడవ జిల్లా అవార్డును స్వీకరించిన సందర్భంగా కలెక్టర్‌ను అధికారులు సత్కరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఓ గణపతి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాథోడ్ నరేందర్, ఐటిడిఎ డిడి దిలీప్ కుమార్, బిసి సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డిప్యూటీ సీఈఓ రాథోడ్ రాజేశ్వర్, ఎంపిడిఓలు, ఎపిఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పేదలకు నాణ్యమైన వైద్యమందించడమే లక్ష్యం

- రిమ్స్‌లో ఫాకో మిషన్ ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచుతూ ఇబ్బంది తలెత్తకుండా చూస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. రిమ్స్‌లో బుధవారం ఫాకో మిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి హరీష్‌రావు హైదరాబాద్ నుండి సమావేశాన్ని ఏర్పాటు చేసి పది జిల్లాల్లో మిషన్‌లను ప్రారంభించారు. వైద్యారోగ్య శాఖలో అమలు చేస్తున్న నూతన సంస్కరణలు, సాధించిన పురోగతిని వివరించారు. రిమ్స్‌లో మెరుగైన సేవలు అందుబాటులోకి తెస్తున్నందున ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కంటి ఆపరేషన్‌ల నిమిత్తం అందుబాటులోకి తెచ్చిన ఫాకో మిషన్‌ను ప్రారంభించారు. పరికరం పని తీరును డాక్టర్ ఇద్రిస్ అక్బాని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధునాతన పరికరాలతో వైద్య సేవలందించడానికి ఫాకో మిషన్‌ను అందుబాటులోకి తేవడం జరిగిందని తెలిపారు. కంటికి సంబంధించిన ఆపరేషన్‌లు ఇకపై సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో వైద్యారోగ్య రంగంలో ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. త్వరలోనే ఎంఆర్ఐ పరికరాన్ని సైతం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గతంలో నాణ్యమైన వైద్యం అందక ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసిన ఆయన ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని తెలిపారు. త్వరలోనే రిమ్స్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో వైద్యుల భర్తీ పూర్తి కానుందని వెల్లడించారు. మెరుగైన వైద్యం కోసం బయట ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా రిమ్స్‌లోనే అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆర్ఎంఓ తోడసం చందు, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పాల్గొనాలి

నవతెలంగాణ-బేల

రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొని బహుమతులను గెలుచుకోవాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. బుధవారం యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మండలంలోని దహెగాం గ్రామంలో యువతకు అవగాహన కల్పించారు. జులై 2న నిర్వహించే ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పాల్గొని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ ప్రశ్నలకు చరవాణిలో సమాధానాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అఖిల్, విపిన్ ఠాక్రే, చంద్రకాంత్, గ్రామస్తులు గణేష్, జగదీష్ ఉన్నారు.

ఆర్జీయూకేటీ వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ ఆందోళన

- విద్యార్థినుల కుటుంబాలకు కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్
- స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌కు వినతి పత్రం



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీలో వరుసగా విద్యార్థినుల ఆత్మహత్యలను నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ బుధవారం ప్రధాన గేటు వద్ద ఆందోళన నిర్వహించింది. బారికేడ్లను తోచుకొని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తామని యూనివర్సిటీ విసి, డైరెక్టర్లతో మాట్లాడుతామని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పోలీసులను కోరారు. అనుమతి లేదని, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌తో మాట్లాడిస్తామని పోలీసులు చెప్పారు. దీంతో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ దత్తుకు వినతి పత్రాన్ని అందజేశారు. విద్యార్థినుల కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ యూనివర్సిటీలో పర్యటించి విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా పరిష్కారం కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యూనివర్సిటీలోని విద్యార్థినుల తల్లిదండ్రులు సమస్యలు ఉన్నాయంటూ తమ దృష్టికి తీసుకొచ్చినట్లు డీన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరు మృతి చెందినా ఒక్క మంత్రి కూడా యూనివర్సిటీని సందర్శించలేదని తెలిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విద్యాభ్యాసంలో చేపట్టిన సంస్కరణల కారణంగా విద్యాభివృద్ధిలో ఉన్నత స్థానంలో ఉందని, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులను ఢిల్లీకి పంపి విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై కేజ్రీవాల్ ప్రభుత్వ పనితరుపై అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల మృతికి బాధ్యులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ నాయకులు బుర్ర రాములుగౌడ్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి దిద్ది సుధాకర్, ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ సుభాష్ రాథోడ్, నిర్మల్ జిల్లా కోఆర్డినేటర్ హైదర్, పార్టీ అధికార ప్రతినిధి తేజ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి చిన్నారుల బాల్యాన్ని కాపాడాలి



నవతెలంగాణ-నిర్మల్

అన్ని ప్రభుత్వ విభాగాలతో పాటు, స్వచ్ఛంధ సంస్థలు సమన్వయంతో కలిసి పని చేసి వెట్టిచాకిరీ నుండి చిన్నారులను రక్షించి, వారి బాల్యాన్ని కాపాడాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జూలై మొదటి తేది నుండి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ 9విడతలో భాగంగా జిల్లాకు చెందిన చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్ ప్రొటక్షన్, రెవెన్యూ, విద్య, వైద్య, లేబర్, విభాగాల అధికారులతో ఏఎస్పీ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తప్పిపోయిన, వదిలేయబడిన, రోడ్డుపై భిక్షాటన చేస్తున్న, బాల కార్మికులుగా పనిచేస్తున్న 18 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించడం లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. జిల్లాలో ఎక్కడైన బాలకార్మికులు కనబడితే వెంటనే డయల్ 100కి గాని, 1098 చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్‌కు గాని ఫోన్ చేసి సమాచారం అందించే విధంగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. రానున్న రోజుల్లో బాలకార్మికుల నిర్మూలకు ప్రతి నెల ఒక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రతినెల ఒక్కో రంగాన్ని ఎంచుకొని పనిచేసే బాలకార్మికులను గుర్తించి వారిని వెట్టిచాకిరి నుండి విముక్తి కలిగించాలన్నారు. చిన్నారులతో వెట్టిచాకిరి చేయించుకోవడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ రవీందర్ నాయక్, ఎస్‌ఐ సుమాంజలి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్, లేబర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముక్రా(కె) గ్రామాన్ని సందర్శించిన సొనాల పాలకవర్గ సభ్యులు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు బుధవారం ఇచ్చోడ మండలంలోని ముక్రా-కె గ్రామపంచాయతీ సందర్శించారు. శ్మశాన వాటిక, డంపింగ్ యార్డ్, నర్సరీలను పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి అభివృద్ధి పనుల గురించి పాలకవర్గం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మీనాక్షి, ఎంపిటిసి సుభాష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెట్లపెల్లి సదానందం, ఉపసర్పంచ్ గంగామణి, సెక్రెటరీ స్వామి, వార్డు సభ్యులు పంచాక్షరి, మున్నాలగౌడ్, జీవన్‌కుమార్, కల్పన, జ్యోత్స్న, సంగీత, లక్ష్మి బిల్ కలెక్టర్ అజారుద్దీన్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి : డీసీసీ అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. గడపగడప కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం బృందావన్ కాలనీ, కృష్ణానగర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, యువతకు నాలుగువేల నిరుద్యోగ భృతి ఇస్తామని పేర్కొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్



మండల కేంద్రానికి చెందిన దుందుగులు భీమన్న కుమార్తె వివాహానికి సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు అన్ని వేళలా తోడుగా ఉంటు వారికి తనవంతు సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట గుంజ చిన్నయ్య, ఎల్లయ్య, శీను, రాజు ఉన్నారు.

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. టూటౌన్ ఎస్ఐ విష్ణుప్రకాష్ వివరాల ప్రకారం పట్టణంలోని భాగ్యనగర్‌లో నివాసం ఉండే రాజమౌళి(47) కొన్ని నెలల నుండి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రిలో చూపించినా తగ్గడం లేదని, బాధ భరించలేక మనస్తాపానికి గురై బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు. వెంటనే గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పిల్లలు పనిలో కాదు..బడిలో ఉండాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

బడీడు పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలని బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఉట్నూర్ డివిజన్ కన్వీనర్ గెడం భరత్ అన్నారు. బుధవారం దీనికి సంబంధించిన పోస్టర్లను జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం గోపాల్‌సింగ్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని అందుతండా, కొలాంగూడ, సకారంతండా, వడగాప్ తదితర మారుమూల గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. 5-14 సంవత్సరాల లోపు పిల్లలు వివిధ పనులో కాకుండా బడిలో ఉండాలని అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పొలంలో పాలేరుగా, హోటళ్లలో పనులకు పెట్టడం చట్ట రీత్యా నేరమనారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావ్, రవీందర్‌చారి, మాన్‌సింగ్, జగదీష్ పాల్గొన్నారు.

మావల తహసీల్దార్ కార్యాలయం పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శిథిలావస్థకు చేరిన మావల తహసీల్దార్ కార్యాలయాన్ని డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ(డీఎల్ఎస్ఏ) జిల్లా కార్యదర్శి క్షమా దేశ్‌పాండే పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తహసీల్దార్ కార్యాలయం నీటితో తడిసిపోయి తరుచూ షాక్ సర్క్యూట్ సమస్య నెలకొంటోంది. ఇటీవల కొందరు ఆదివాసీ నాయకులు పని నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా మల్లు అనే వ్యక్తికి కరెంట్ షాక్ తగలడంపై తహసీల్దార్‌కు సమస్యను వివరించారు. అయిన ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆదివాసీ భారత్ మహాసభ ఐక్యవేదిక కన్వీనర్ కినక సురేష్ ఆధ్వర్యంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె స్పందించి బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితిపై ఆరా తీశారు. దీంతో భవనం శిథిలావస్థకు చేరిన విషయం, నూతన భవనం కోసం కలెక్టర్‌కు నివేదిక సమర్పించామని డిప్యూటీ తహసీల్దార్ ఆమెకు వివరించారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



నవతెలంగాణ-బేల

దేశ సేవ చేస్తూ వీర మరణం పొందిన జవాన్‌కు మండల కేంద్రంలో బుధవారం ఘన నివాళి అర్పించారు. వీర జవాన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీర సైనికుడు బిజేంద్ర కుమార్ శర్మ 25 జూన్ 2002న రాత్రి సమయంలో తన సహచరులతో కలిసి జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చి దేశ రక్షణలో తన ప్రాణాలు అర్పించారు. ఆయన త్యాగాన్ని యావత్ దేశం గర్విస్తోందని కుటుంబ సభ్యులు రాధేశ్యామ్ అన్నారు. దేశ రక్షణకు అవసరమైతే తన కుమారులను సైతం పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణకుమార్, సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్, సతీష్ పవార్, దేవన్న, తేజరావ్ మస్కె, విపిన్ ఖోడే, అనోజ్ గుండావార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చైర్మెన్, వైస్ చైర్మెన్ అవిశ్వాసంపై కోర్టు స్టే

- తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం
- మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



ఇటీవల ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌పై పెట్టిన అవిశ్వాసంపై చైర్మెన్ అంకం రాజేందర్ హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన చిన్న మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు సహకరించి తోడ్పాటును అందించాల్సిన పలువురు కౌన్సిలర్లు స్వార్థపూరిత రాజకీయాలు చేయడం తగదన్నారు. పాలకవర్గం కొలువు దీరిన మూడున్నరేండ్ల కాలంలో కనిపించని అవినీతి ఇప్పుడు కనిపించిందా? అని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగితే నిర్మాణ సమయంలో ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదని ప్రశ్నించారు. శ్మశాన వాటికను సభ్యుల తీర్మానం ఆమోదం మేరకే గోదావరి ఒడ్డున నిర్మించామని తెలిపారు. గత సంవత్సరం వరద తాకిడికి కొట్టుకుపోతే పనుల్లో అవినీతి జరిగిందనడం సమంజసం కాదన్నారు. పట్టణంలో జరుగుతున్న వివిధ నిర్మాణాలన్నీ కౌన్సిలర్లకు తెలిసే జరుగుతున్నాయని పేర్కొన్నారు. పట్టణంలో జరిగే అభివృద్ధి పనులు చైర్మెన్, వైస్ చైర్మెన్ ఏకపక్ష నిర్ణయంతో జరగవని, పాలక వర్గం ఆమోదంతో అధికారులు సూచించిన ప్రకారం కాంట్రాక్టర్లు చేస్తారని తెలిపారు. అవిశ్వాసం ప్రకటించడంపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అనవసర ఆరోపణలు చేస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. అభివృద్ధికి ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే పట్టణ ప్రజలు ఏమాత్రం సహించరని హెచ్చరించారు. ఈ సమావేశంలో కో ఆప్షన్ సభ్యుడు బండారి కిషోర్, నాయకులు పానగంటి రాజేందర్, కారింగుల సుమన్ ఉన్నారు.

నేటి బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- మైదాన్‌లో పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రార్థనల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పురపాలకం తరపున పూర్తి చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. బుధవారం ఈద్గా మైదానంలో జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లకు సంబంధించిన పనులను ఎమ్మెల్యే పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రార్థనల సమయంలో ఇబ్బంది కలగకుండా తగు ఏర్పాట్లు చేపడుతున్నారన్నారు. గురువారం ఉదయం ముస్లిములు ఈద్గా మైదానంలో నమాజ్ ఆచరించనున్న నేపథ్యంలో మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. వర్షం కారణంగా ఏర్పడిన గుంతలను పుడ్చివేశారు. గురువారం వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఆయా కాలనీల్లోనే ప్రార్థనలు చేసుకోవాలని ముందుగానే సూచించినట్లు ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ మోయిన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, అష్రఫ్, ఇమ్రాన్, సాజిదొద్దీన్, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

ధరలకనుగుణంగా వ్యవసాయ కూలిరేట్లు పెంచాలి

నవతెలంగాణ-నిర్మల్



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలి రేట్లు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. బుధవారం ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో వ్యవసాయ కూలీల రేట్లు అతి తక్కువగా ఉన్నాయన్నారు. వ్యవసాయ కూలీలకు ఆడవారికి రూ.200, మగవారికి రూ.500కు మించి రావడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీలు పెంచినట్లయితే రోజుకు రూ.800 చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీల కూలి రేట్లను తెలంగాణ ఏర్పడిన తర్వాత సవరించలేదన్నారు. రోజు కూలి కనీసం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కువ మంది కూలీలు వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వారు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో కూలి రేట్ల పెంపదలకు కూలీలను ఐక్యం చేసి పోరాడతామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు గైని మురళీమోహన్ పాల్గొన్నారు.

బృహత్ పల్లెప్రకృతిలో పోషక వనం ఏర్పాటు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ఆలూరు గ్రామంలో గల బృహత్ పల్లె ప్రకృతి వనంలో పోషక వనం ఏర్పాటు చేశామని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పోషక వనంలో సేంద్రియ ఎరువులతో ఎకరం భూమిలో కూరగాయలు పండించేందుకు విత్తనాలు నాటారు. పాలకూర, మెంతి, చిక్కుడు, టమాటా, గోపి పువ్వు వంటి కూరగాయల విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు అంగన్వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన కల్తీలేనివి రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ ఆదేశానుసారం అందించేందుకు పోషక వనం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పథని రాధ - భునేష్, పిఎసిఎస్ వైస్ చైర్మెన్ లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ పథాని రాధ - సాయికృష్ణ, ఎంపీటీసీ ఎస్.వెంకటరమణారెడ్డి, సల్ల సాయన్న, ఎంపిడిఓ సరోజ, ఎపిఓ లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి లింగయ్య, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సత్కారం

నవతెలంగాణ-బాసర

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలో మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన అమర్నాథ్, బలగం శ్రీనివాస్‌ను బుధవారం పిఆర్టియు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పిఆర్టియు అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత, ఉపాధ్యాయులు ఇందిరా, గీత, శ్రీధర్, సీఆర్పీ మహేష్ పాల్గొన్నారు.

ఈద్గాను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-నిర్మల్

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ జిల్లా కేంద్రంలోని ఈద్గాను పరిశీలించారు. బక్రీద్ సందర్భంగా ముస్లిములు ప్రార్థనలు చేయనున్న నేపథ్యంలో ముస్లిం పెద్దలు, కౌన్సిలర్స్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రార్థనలకు వచ్చే ముస్లిం సోదరులకు రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సహాయ సహకారాలతో మంచి నీరు, పార్కింగ్, ట్రాఫిక్, టెంట్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. చైర్మన్ వెంట ఆయా మజీద్‌ల పెద్దలు, కౌన్సిలర్స్, నాయకులు ఉన్నారు.

సహకార సంఘ సమావేశం



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని సహకార సంఘ భవనంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం ద్వారా రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. స్వల్ప కాలిక రుణాలు ఏడుకోట్ల 78 లక్షల 91 వేలు కాగా దీర్ఘకాలిక రుణాలు కోటి 20 లక్షలు ఇచ్చామని తెలిపారు. 5588 మంది రైతుల వద్ద నుండి 91వేల క్వింటాళ్ల శనగలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. జొన్నలు 2233 రైతుల వద్ద నుండి 43వేల క్వింటాళ్లు కొన్నామన్నారు. సోయా విత్తనాలు 1050 పంపిణీ చేసినట్లు తెలిపారు. సహకార సంఘం ఎల్లప్పుడు రైతులకు అండగా ఉంటుందన్నారు. సమావేశంలో సీఈఓ మోతే శ్రీనివాస్, సహకార సంఘ డైరెక్టర్లు లింగారెడ్డి, మనిరామ్, లక్ష్మి, గంగారాం, ఆశమ్మ, జలంధర్, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సహకార సిబ్బంది సాగర్, గంగయ్య, భీంరావ్, ముస్తఫా, రమాకాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని క్రీడా పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు వెంటనే రద్దు చేయాలని టిఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ స్వామి, వి అశోక్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. క్రీడా పాఠశాలలో డిప్యూటేషన్ల కోసం జిల్లా విద్యాశాఖాధికారి నోటిఫికేషన్ విడుదల చేశారని, ఆసక్తి కలిగి పాఠశాలలో అదనంగా ఉన్న ఉపాధ్యాయులు సంబంధిత ఎంఈఓ, హెడ్మాస్టర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అయితే దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులలో అర్హులను కాదని కొంతమంది అనర్హులకు అవకాశం కల్పించారన్నారు. దీన్ని టిఎస్‌యూటీఎఫ్‌గా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వెంటనే నిబంధనలకు విరుద్ధంగా నియమించిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దు చేసి, అర్హులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యక్తుల ఆసక్తులకు అనుగుణంగా, నిబంధనలు అతిక్రమించి కేటాయించే ఇలాంటి వాటిపై తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం టీఎస్ ఎంసెట్ కౌన్సిలింగ్ ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం మొదటి దశ ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్లాట్ బుక్ చేసుకున్న విధంగా అభ్యర్థులు కేంద్రానికి ఉదయాన్నే చేరుకున్నారు. అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది. ఈ ప్రక్రియను ఎంసెట్ కోఆర్డినేటర్ భరద్వాజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ప్రారంభమైన కౌన్సెలింగ్ ప్రక్రియ మూడు రోజుల (28, 29, 30) పాటు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకున్న సమయానికి తమ ధ్రువపత్రాలతో కేంద్రానికి రావాలని సూచించారు. జూన్ 28 నుంచి జూలై 8 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు. జూలై 12న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. మొదటి రోజు 230 మంది స్లాట్ బుక్ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ వీరస్వామి, సిస్టం అనలిస్ట్ సుజయ్, అధ్యాపకులు రాజన్న, జోత్స్న రాణి, నీల్‌కమల్, సుధాకర్, సంగీత, రామేశ్వర్‌రెడ్డి, సంతోష్, కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్చకుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి



నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలోని యాగ మండపంలో బుధవారం పూర్ణాహుతిని నిర్వహించారు. అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణానికి ఆటంకాలు ఏర్పడటంతో శృంగేరి జగద్గురువులు శ్రీ భారతీ తీర్థ స్వామి, విధు శేఖర భారతి మహాస్వామి ఆదేశానుసారం ఐదు రోజులుగా యాగ మండపంలో గణపతి పూజ, పుణ్యా వచన నిర్వహించి వేద మంత్రోచ్చారణలతో పూర్ణాహుతిని వేడుకగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐని మున్సిపల్ కార్మికుల ఖాతాలలో జమ చేయాలని మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దర్శనాల నగేష్ అన్నారు. ఈ విషయమై బుధవారం మున్సిపల్ కమిషనర్ శైలజకు యూనియన్ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. 3నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి, ప్రతి నెల 5లోపు జీతాలు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ విషయాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు నక్క రాందాస్, ఉపాధ్యక్షులు శ్రీలక్ష్మి, శంకర్, చిరంజీవి, ఆనంద్ పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కొరకు జులై 15 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ప్రణీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం కొరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ప్రింట్ అవుట్ కాపీలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

గోబర్ గ్యాస్ ప్లాంట్ల పరిశీలన

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని దేవుని కూడా కొత్తూరుపల్లి గ్రామలో ప్రభుత్వ పాఠశాలలో నిర్మిస్తున్న, గోబర్ గ్యాస్ ప్లాంట్ల నిర్మాణ పనులను మంచిర్యాల డీఆర్డీఓ శేషాద్రి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరుల వినియోగంలో భాగంగా గ్రామీణ్ స్వచ్ఛ సర్వేక్షన్‌లో గ్యాస్ ప్లాంట్లను నిర్మిస్తున్నామన్నారు. పనులను త్వరగా పూర్తిచేయాలని ఆయా గ్రామాల సర్పంచులకు కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీఓ రమేష్ ఏపీఓ రవీందర్, ఆ గ్రామ సర్పంచ్ గుర్రం శిరీష, గోపాల్‌రెడ్డి, విలాస్, తిరుపతి పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణం బురద మయం

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని బోదంపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలం బురదమయంగా మారి విద్యార్థులు ప్రాంగణంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. బడి ప్రాంగణం ఇలా, విద్యార్థులు చదువుకొనేది ఎలా అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణాన్ని చదును చేసి విద్యార్థులకు ఆటస్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

జన సమీకరణలో ప్రత్యేకత చాటుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 30న సీఎం కేసీఆర్ జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో మండల నుండి ఇచ్చిన లక్ష్యానికంటే ఎక్కువగా జన సమీకరణ చేసి ప్రత్యేకత చాటుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ తెలిపారు. మండలంలోని మోవాడు వెంకటాపూర్, ఆడదాస్నాపూర్, వావుదాం గ్రామపంచాయతీలలో సర్పంచులు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారిగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసి జన సమీకరణ చేయాలన్నారు. ముఖ్యమంత్రి సభ విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చెర్మన్ అలిబిన్ ఆహేమద్, ఎంపీటీసీ సత్రవేణి సావిత్రి మల్లేష్, సర్పంచ్‌లు లింగు కీర్తన్‌రావు, బాబురావు, నాయకులు బదుపటేల్ పాల్గొన్నారు.

బోధకాలు వ్యాధిపై అవగాహన



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో బుధవారం బోదకాలు వ్యాధిపై డబ్ల్యూహెచ్‌ఓ కోఆర్డినేటర్ శిరీష ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోదకాలు(ఫైలేరియా) వ్యాధి ఎలా వస్తుంది వ్యాధి వచ్చే శరీర భాగాలు తీసుకోవలసిన జాగ్రత్తలు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు తెలిపారు. వ్యాధిగ్రస్తులకు ఎంఎండీపీటీ కిట్టు ఎలా వాడుకోవాలో, వ్యాయామం ఎలా చేయాలో చెప్పారు. ఈ మండలంలో బోధకాల వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉండడంతో ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు పదవ తేది నుంచి నిర్వహించే ఎండిఏ ప్రోగ్రాంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ఇచ్చే మాత్రలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌ఓ కోఆర్డినేటర్లు డాక్టర్ కమలాకర్, డాక్టర్ రాజం, జన్నారం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఉమాశ్రీ, సీహెచ్‌ఓ రమేష్, అల్లాడి శ్రీనివాస్ హెల్త్ ఎడ్యుకేటర్, గుండేటి నాందేవ్ సబ్ యూనిట్ ఆఫీసర్, సూపర్వైజర్లు హెల్త్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు బోదకాలు వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాగజ్‌నగర్ అధ్యయన కేంద్రంలో డిగ్రీలో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ చేసినట్టు కోఆర్డినేటర్ తూదూరి దత్తాత్రేయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రంలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోవచ్చని పేర్కొన్నారు. జులై 31లోగా అడ్మిషన్లు తీసుకోవాలని, ఇతర వివరాలకు 9866398678 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రెండు రోజులుగా అంధకారంలో ఎలుకపెల్లి(బి)

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఎలుకపెల్లి(బి) గ్రామంలో గత రెండు రోజులుగా అంధకారంలో ఉంది. సోమవారం ఎలుకపెల్లి(బి) గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉరుములు, మెరుపులకు కాలిపోవడంతో ప్రజలు చీకట్లో మగ్గుతున్నారు. ఈ విషయమై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ దుర్గం అజయ్‌ని సంప్రదించగా బుధవారం సాయంత్రం వరకు ఎలుకపెల్లిలో విద్యుత్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు.

సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

ఈ నెల 30న జిల్లా కేంద్రంలో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని జడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి అన్నారు. బుధవారం మండలంలోని కేస్లాగూడ, ఝరి గ్రామాలను సందర్శించి మాట్లాడారు. నాయకులకు, ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ కండువాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. 30న జిల్లా కేంద్రంలో తలపెట్టిన సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోవ లక్ష్మీ యువసైన్యం మండల అధ్యకుడు కోట్రాంగే శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు కుర్సెంగ మారుతి, అడా రాంచందర్, పెందోర్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ వనస్పతిరావు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్రంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతీ గృహాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కార్యదర్శి కుమురం భీమ్‌రావు అధ్యక్షతన బుధవారం చెన్నూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఔట్ సోర్సింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. నిత్యం గిరిజన విద్యార్థులకు వంటలు వండి, వారి బాగోగులు చూస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించపోవడం అన్యాయమని అన్నారు. గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికలకు ఇంకా దినసరి వేతనాలు చెల్లిస్తున్నారని, 2017లో కాంట్రాక్టు వర్కర్లను పర్మనెంట్ చేయాలని 2017 సంవత్సరంలో గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ ఇచ్చిన ఆదేశాలు ఇప్పటికి అమలు కాలేదని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యాక్రమాలు చేపట్టాడమే మార్గమని, హైదరాబాద్‌లో ఈ నెల 3న నిర్వహించ తలపెట్టిన చలో కమీషనరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చందు, లక్ష్మన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 30న జిల్లాకు వస్తున్న సీఎం కేసీఆర్ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో జోడేఘట్‌కు వచ్చిన సీఎం జిల్లాలో యూనివర్సిటీ మంజూరు చేస్తానని చెప్పి నేటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. వెంటనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేయాలని, జిల్లాలో నేటికీ చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక వర్షకాలంలో ప్రజలు అత్యవసర పరిస్థితిలో ప్రాణాలు పోయిన పరిస్థితి ఉందన్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండి వాగు వంతెన సంవత్సారాలు గడుస్తున్న నిర్మాణ దశలోనే ఉందన్నారు. గుండి వాగు వంతెనను వెంటనే పూర్తి చేయాలని, పోడు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, గృహ లక్ష్మి పథకం డబ్బులు రూ.10 లక్షలు పెంచాలని, జిల్లాలో దళితులందరికీ మూడు ఎకరాల భూమి, దళితబంద్ ఇవ్వాలని, జిల్లాలో అద్దె భవనాలలో కొనసాగుతున్న వసతి గృహాలకు స్వంత భవనాలు మంజూరు చేయాలని, జిల్లా కేంద్రంలో ఆశ్రమ బాలికల పాఠశాలను యదావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గేడం టీకానంద్, దుర్గం నిఖిల్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నితిన్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన అడ్డుకుంటాం

- సీఐటీయూ జిల్లా సహా కార్యదర్శి జాదవ్ రాజేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించకపోతే సీఎం పర్యటన అడ్డుకుంటామని సీఐటీయూ జిల్లా సహా కార్యదర్శి జాదవ్ రాజేందర్ హెచ్చరించారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 46 రోజులపాటు సమ్మె చేసిన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేస్తామని సమ్మె విరమింప చేశారని నేటికీ నెల రోజులవుతున్న సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పెరుగుతున్నటువంటి ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26,000, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, సెర్ప్ నుండి ఐడీ కార్డ్స్ అర్హులైనవారికి సీసీలుగా పదోన్నతి ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించడంలో కాలయాపన చేస్తున్నదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా వీఓఏల సమస్యలు పరిష్కారం చేయకపోతే కచ్చితంగా అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్యోతి, జిల్లా కోశాధికారి సునీత, బుద్దు, రమేష్, రమ పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయండి

- సీఐటీయూ మండల కార్యదర్శి బోడంకి చందు



నవతెలంగాణ-జైపూర్

సకాలంలో బిల్లులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మధ్యాహ్న భోజన కార్మికులతో వచ్చే జులై 2న చెన్నూర్ పట్టణంలో ఏర్పాటు చేస్తున్న సదస్సుకు అత్యధికంగా హాజరు కావాలని సీఐటీయూ చెన్నూర్ మండల కార్యదర్శి బోడంకి చందు పిలుపునిచ్చారు. చెన్నూర్ నియోజకవర్గం పరిధి కోటపల్లి, వేమనపల్లి, భీమారం, చెన్నూర్ మండలాలకు చెందిన బాధ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న బోజనం వండి వడ్డించడంలో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సదస్సులో నియోజకవర్గం పరిధిలో గల మధ్యాహ్న భోజన కార్మికులు అత్యధికంగా పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు స్వర్గం పోసక్క, రామగాని సమ్మక్క పాల్గొన్నారు.

జిల్లాలో చేసిన అభివృద్ధిపై సీఎం మాట్లాడాలి

- టీడీపీ పార్లమెంటు అధ్యక్షులు గుల్లపల్లి ఆనంద్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వరకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రాంతం పూర్తి వెనుకబాటుకు గురైందని స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులపై సీఎం జిల్లా ప్రజలకు సమాదానం చెప్పాలని తెలుగు దేశం పార్టీ ఉమ్మడి ఆదిలాబాదు పార్లమెంటు అధ్యక్షులు గుల్లపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 30న జిల్లా కేంద్రానికి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వస్తున్న సీఎం కేసీఆర్ జిల్లా ప్రజలకు సమాదానం చెప్పాలన్నారు. జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గం తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించి ఈ ప్రాంత ప్రజల నోట్లో మట్టికొట్టారని దుయ్యబట్టారు. కేవలం కమీషన్ల కోసమే ఈ ప్రాంతంపై వివక్షచూపి ప్రాణహితను తరలించారన్నారు. వర్షాధారంపై ఆధార పడ్డ ఇక్కడి రైతాంగానికి ఒక్కప్రాజెక్టు నీరందించేస్థితిలో లేదన్నారు. కుమురంభీం ప్రాజెక్టు పూర్తైనా కాల్వలు లేక నీరు పారని దుస్థితిలో ఉందన్నారు. 17 సంవత్సరాలైనా జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పూర్తి కాలేదన్నారు. ఇక్కడి రైతాంగంపై చిత్తశుద్ధి ఉంటే జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తారో బహిరంగ సభలో స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. గుండి వాగు వంతెన నిర్మాణంలోనే ఉందని, కిరిడికి రోడ్డు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, సీఎం ఆకస్మికంగా జిల్లాలోని ఏ ప్రాంతానికి వెళ్ళినా ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. అన్ని శాఖల్లోనూ డబ్బులివ్వనిదే పని జరిగే పరిస్థితి లేదన్నారు. కస్తూర్బాల్లో విద్యార్థులు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదన్నారు.

రైల్వే వంతెన వద్ద టిడిపి నాయకుల నిరసన



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పరిధిలోని స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జీ ప్రాంతంలో బుధవారం టీడీపీ చెన్నూర్ ఇన్‌ఛార్జి సంజయ్ కుమార్ బురదలోదిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు పట్టణ ప్రజల గోస పట్టదా అని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన ప్రక్కన మట్టి రోడ్డు బురదమయంగా మారిందని వంతెన పనులు ఇంకా ఎన్ని సంవత్సరాలు పూర్తి అవుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెన పనులు ప్రారంభమై 10 సంవత్సరాలు గడిచిన ఎందుకు పూర్తి చేయడం లేదని, ప్రజలు ఇబ్బంది పడుతున్న మున్సిపల్ పాలకవర్గం కూడా తమకు ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయగిరి శంకర్, మెరుగు శంకర్, జక్కుల సమ్మయ్య, శ్రీనివాస్, ఎండీ జలీల్ పాల్గొన్నారు

సీఎంను కలిసేందుకు అనుమతించాలి

- కలెక్టర్‌కు ఎస్పీఎం నెగోషియేషన్ వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 30న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి రానున్న సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు అనుమతించాలని ఎస్పీఎం నెగోషియేషన్ కమిటీ నాయకులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలిసి తమ సమస్యను వివరించారు. వారు మాట్లాడుతూ మిల్లు పున:ప్రారంభమై ఐదు సంవత్సరాలైనా నేటికీ పర్మనెంటు కార్మికులను విధుల్లోకి తీసుకోలేదన్నారు. సుమారు 200 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ విషయమై యాజమాన్యానికి విన్నవించినా కక్ష సాధింపుకు పాల్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నెగోషియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

అర్హులైన పేదలందరికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న డబల్ బెడ్ రూమ్‌లు పట్టణ పేదలకు ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.పది లక్షలు చెల్లించాలన్నారు. మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అనిత, ఆటో యూనియన్ నాయకులు ఇన్నోస్, ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ పద్మ మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఇండ్ల స్థలాలు డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలన్నారు. రేషన్ కార్డు లేని వాళ్ళందరికీ రేషన్ కార్డులు, పెన్షన్ లేనివారికి పెన్షన్లు వెంటనే ఇవ్వాలన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళు ఇస్తానని రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.సంజీవ్, మల్లేష్, పద్మ సురేఖ, డీవైఎఫ్ఐ నాయకులు చాపిడి పురుషోత్తం, శివ, రత్న కుమార్, సతీష్, నిలేష్ మహిళా సంఘం నాయకులు మీనా, ఆటో యూనియన్ నాయకులు ఖాన్ షరీఫ్, అక్బర్ పాల్గొన్నారు.

బురదమయంగా ప్రధాన రోడ్డు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మండలంలోని అగర్‌గూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో బొక్కివాగు వంతెన వద్ద వర్షానికి బురదమయం కావడంతో అటువైపుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. బురదలో ద్విచక్ర వాహనాలు జారి క్రిందపడడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై బురదను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రానున్న ఎన్నికలపై ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో తహసీల్దార్ వనజరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు జులై ఒకటవ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఫారం-6 ద్వారా ఓటరుగా పేరును నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితా నుంచి మరణించిన వ్యక్తులు లేదా ఇటీవల కొత్తగా పెండ్లి చేసుకున్నవారు వివరాలతో పాటు ఫారం-7 నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల పేరు ఇంటిపేరు తండ్రి పేరు ఇతర పోలింగ్ స్టేషన్లలో మార్చుటకు ఫారం-8 ద్వారా సవరించుకోవచ్చన్నారు. స్వచ్ఛంద సంస్థలు యువజన సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది వీఆర్ఏలు పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే బలం

జైనూర్ : కార్యకర్తలే బీఆర్ఎస్‌కు బలమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపు జిల్లా కేంద్రంలో నిర్వహించే ముఖ్యమంత్రి కేసీఆర్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రేపు నిర్వహించే సభకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై రాష్ట్రంలో ముఖ్యమంత్రి చేస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలుపుదామని పిలుపునిచ్చారు. కార్యకర్తలందరు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను అధిక సంఖ్యలో తీసుకొచ్చేలా చూడాలని కోరారు. బీఆర్ఎస్‌ని బలోపేతం చేయడానికి కార్యకర్తలతోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరు సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ అందరు కలిసి జిల్లాకేంద్రంలో నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్ యాదవ్, మండల అధ్యక్షుడు మడావి భీంరావు, సర్పంచ్‌లు మెస్రం పార్వతి లక్ష్మణ్, మెస్రం నాగోరావు, మెస్రం రాహుల్ పాల్గొన్నారు.

రాంపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

- డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని రాంపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా ఎన్ని ప్రభుత్వాలు మారిన రాంపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. నిత్యం ప్రజలు జిల్లా ఆసిఫాబాద్‌కు, కాగజ్‌నగర్‌కు విద్యార్థులు చదువు కోసం నిత్యం వెళ్తుంటారని, విద్యార్థులు, ప్రజలు చెప్పులు చేతిలో పట్టుకొని నడుస్తున్న పరిస్థితి దాపురించిందన్నారు. అత్యవసరమైతే అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే రోడ్డు బాగా లేనందున రాలేకపోతున్నామని, రోడ్డు వరకు రోగులను తీసుకురావాలంటున్నారని తెలిపారు. ఎడ్ల బండి మీద తీసుకెళ్లిన పరిస్థితి ఈ గ్రామంలో ఉంది. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎన్ని వినతిపత్రాలు అందజేసిన రాంపూర్ గ్రామ ప్రజలు గోడును పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రజల బాదను అర్థం చేసుకొని గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి విద్యార్థులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చాపిడి శివ, మండల ఉపాధ్యక్షుడు చల్లూరి వంశీ పాల్గొన్నారు.

పర్సనల్ విభాగం గదులు ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన పర్సనల్ విభాగం గదులను బుధవారం డైరెక్టర్(పా) బలరాం ప్రారంభించారు. మొదటగా డైరెక్టర్ స్వచ్ఛత పక్వాడాలో భాగంగా ఎప్పటికప్పుడు మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. ఉద్యోగులకు తడి చెత్త, పొడి చెత్త డబ్బాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పర్సనల్ విభాగం అనేది అత్యంత కీలకమైనదని, ఇరుకు గదులలో కాకుండా విశాలంగా ఉండేందుకు ప్రత్యేకంగా పర్సనల్ విభాగ గదులను నిర్మించడం జరిగిందని తెలిపారు. జూన్ 5వ తేదీన నిర్వహించిన సింగరేణి సంబరాలు అంబరాన్నంటాయని, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డిని ప్రశంసా పత్రంతో సత్కరించారు. తాను ఎప్పుడు చూడని విధంగా తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఆటపాటలతో, కోలాటాలతో కార్మికులు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనేలా కృషి చేశారని తెలిపారు. అలాగే జూన్ 30వ తేదీన పదవి విరమణ పొందుతున్న జీఎం పర్సనల్, ఈఈ, సీఎస్ఆర్, ఐఆర్‌పీఎం కుమార్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. అలాగే శ్రీరాంపూర్ ఏరియాలోని పర్సనల్ విభాగ అధికారులు, ఆఫీసర్స్ అసోసియేషన్ అధికారులు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత లైబ్రరీని ఏర్పాటు చేయాలని వినతి

శ్రీరాంపూర్ ఏరియాలో నిరుద్యోగుల కొరకు శాశ్వత లైబ్రరీని ఏర్పాటు చేయాలని నిరుద్యోగులు శ్రీపెల్లి రాజు, కలితి రాజు, తగరం సాగర్, కట్ల శ్రీనివాస్, విజయ్ రాజు డైరెక్టర్(పా) బలరాంకి, జనరల్ మేనేజర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి శ్రీరాంపూర్ ఏరియాలో లైబ్రరీ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కొంతమంది సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి పరిస్థితి ఉందన్నారు. డైరెక్టర్ నిరుద్యోగులపై దృష్టి సారించి శాశ్వత లైబ్రరీని ఏర్పాటు చేయాలని కోరారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 30న జిల్లాకు వస్తున్న సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన నిర్వహించాలని బహిరంగ సభ ప్రారంభ పనులను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్పలతో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాకకు పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్ష ప్రభావంతో కొంత ఇబ్బందులు అయినప్పటికీ పర్యటన విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. పర్యటనలో భాగంగా నిర్వహించే ఐదు కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, బహిరంగ సభాస్థలి నిర్మాణం గురువారం మధ్యాహ్నం వరకు పూర్తవుతుందన్నారు. జర్మన్ టెక్నాలజీతో సభాస్థలి ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూస్తున్నామన్నారు. ఏర్పాట్లలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ పాల్గొన్నారు.

వాంకిడి : ఈ నెల 30న కుమురంభీం జిల్లాకేంద్రంలో నిర్వహించే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, జడ్పీటీసీ అజయ్‌కుమార్ బుధవారం అన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. జిల్లాకేంద్రంలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం ప్రారంభించడం జరుగుతుందని, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కౌటాల : ఈ నెల 30న జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించడానికి వస్తున్న సీఎం కేసీఆర్ సభకు మాలీ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని మాలీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందని, దానికి రుణపడి మాలీ కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నికోడె గంగారాం, సర్పంచ్‌లు ఆదె శ్రీనివాస్, మోర్లె రమేష్, వసాడె నిహారిక జ్యోతిరావు ఉన్నారు.

మన ఊరు-మనబడి పనుల్లో జాప్యం తగదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ బడుల దిశ దశ మార్చే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన మన ఊరు మనబడి అభివృద్ధి పనులు జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలో జాప్యం చేయడం పట్ల విద్యాశాఖ కోఆర్డినేటర్లు జంబోజు సత్తయ్య, భరత్, సురేష్ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని బజార్‌వాడి ఎంపీపీఎస్ పాఠశాలలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జాప్యం జరగడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలల్లో మైనర్ రిపేర్లు తాగునీటి సౌకర్యం త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టడానికి గ్రామపంచాయతీ తీర్మానం తీసుకోవాలన్నారు. పాఠశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచడంతోపాటు విద్యార్థులకు త్వరగా యూనిఫాం అందజేయాలని సూచించారు.

హత్య కేసులో 13 మంది రిమాండ్



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని జక్కులపల్లి గ్రామంలో జరిగిన ఇద్దరి హత్య కేసులో 13 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్ తెలిపారు. నిందితులు మండల మల్లేష్, నాగయ్య(పెంచికల్‌పేట్), మండల గణేష్, అజ్జయ్య(జక్కులపల్లి), మండల వెంకటేష్, గిరుగుల భీంరావు(జక్కులపల్లి), గిరుగుల రాకేష్(జక్కులపల్లి), మండల రంగక్క(పెంచికల్‌పేట్), గిరిగుల రజిత(జక్కులపల్లి), మండల రజిత(జక్కులపల్లి), మండల రుక్మా(జక్కులపల్లి), రాదె భూమక్క(ఇట్యాల), రాదె బూదయ్య(ఇట్యాల), గిరుగుల దుర్గక్క(జక్కులపల్లి), గిరుగుల సౌమ్య(జక్కులపల్లి)ను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. దాడిలో మండల నర్సయ్య(జక్కులపల్లి), గిరిగుల బక్కక్క (జక్కులపల్లి) మృతిచెందారు. రెండు గొడ్డళ్లు, రెండు కత్తులు, నాలుగు కర్రలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే రెబ్బెన మండలంలోని జక్కులపల్లి గ్రామ శివారులో మండల బక్కయ్యకు వ్యవసాయ భూమి ఉంది. భూమి విషయంలో బక్కయ్య కుటుంబీకులకు, మండల మెంగయ్య కుటుంబీకులకు గత రెండు సంవత్సరాల నుంచి గొడవలు జరుగుతున్నాయి. కాగా ఈ నెల 25వ తేదీన ఆదివారం మండల బక్కయ్య కుటుంబసభ్యులతో కలిసి పత్తి విత్తనాలు వేస్తుండగా అది తెలిసిన మండల మెంగయ్య, అతని కుటుంబసభ్యులు 26వ తేదీ సోమవారం బక్కయ్య కుటుంబసభ్యులపై మెంగయ్య అతని కుటుంబసభ్యులు కత్తులు, గొడ్డలి, రాళ్లు, కర్రలు, కారంపొడితో భూమి వద్దకు వెళ్లారు. అది గమనించిన బక్కయ్య, అతని కుటుంబసభ్యులు వారిని ఆపడానికి వెళ్లినప్పుడు నిందితులు కత్తులు, గొడ్డలి, రాళ్లు, కారంపొడితో బక్కయ్య కుటుంబసభ్యులపై దాడి చేశారు.

ఈ దాడిలో మండల నర్సయ్య, గిరిగుల బక్కక్క అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా వారికి గాయాలయ్యాయి. తర్వాత నిందితులు అక్కడి నుండి పారిపోయారు. ఈ విషయంపై మండల ఇందిరా ఫిర్యాదు మేరకు రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో పీఆర్ నెంబర్ 90/2023, యూ/ సెక్షన్ 1043, 1047, 148, 302, 307, ఆర్/డబ్ల్యు 149 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసును చేదించడంలో ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సీఐ అల్లం నరేందర్, రెబ్బెన ఎస్సై భూమేష్ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి 13 మంది నిందితులను అరెస్టు చేసి బుధవారం ఆసిఫాబాద్ కోర్టులో హాజరు పరిచారు.

జైనూర్ నూతన సీఐగా మల్లేష్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-జైనూర్

గత కొన్ని సంవత్సరాల నుండి జైనూర్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌కు సీఐగా ఇటీవల బదిలీ అయ్యారు. బుధవారం బదిలీపై వెళ్లిన రామకృష్ణ స్థానంలో జైనూర్ సీఐగా మల్లేష్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్‌ను జిల్లాకేంద్రానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

దళితులందరికీ దళితబంధు ఇవ్వాలి

నవతెలంగాణ-కడెం

అర్హులైన దళితులందరికీ దళితబంధు అందజేయాలని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన దళితులతో కలిసి దళితబంధు అప్లికేషన్ బరో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గజానన్‌కు దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని దళితులందరికీ పార్టీలకతీతంగా దళితబంధు పథకం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకురాలు దుర్గాభవాని, మండల నాయకులు మల్లేష్ యాదవ్, వజీద్, రమేష్, శ్రీను పలువురు దళితులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందజేత



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లిలోని చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ స్వగృహంలో చెన్నూరు నియోజకవర్గంలోని 357 మంది ఆడబిడ్డలకు రూ.3.57 కోట్ల విలువగల కల్యాణలక్ష్మీ, సాదీముబారక్ చెక్కులను బుధవారం ప్రభుత్వ విప్ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. నియోజకవర్గంలో రూ.128.63 కోట్లతో మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వారి ఆశీస్సులతో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. తెలంగాణలో మెరుగైన పాలన కొనసాగాలంటే కేసీఆర్ ప్రభుత్వమే రావాలని ఆకాంక్షించారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, సాగునీటి రంగాల్లో అద్భుత పురోగతి సాధించామని తెలిపారు. రూ.28 కోట్లతో చెన్నూరు పట్టణంలో అంతర్గత రోడ్లు, డ్రైన్లు, రూ.20 కోట్లతో మందమర్రి మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు, డ్రైన్లు, రూ.15 కోట్లతో క్యాతనపల్లి మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే చెన్నూరు బస్ డిపో పనులు త్వరలోనే మొదలవుతాయని ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే కేసీఆర్ ప్రభుత్వం మళ్ళీ రావాలని గత పాలకులకు దోచుకోవడానికే సమయం సరిపోలేదని అన్నారు. చెన్నూరు నియోజకవర్గాన్ని పట్టించుకున్న పాపానపోలేదని ఓట్లు వేసేదాకా ఓడ మల్లన్న వేసినాక బోడ మల్లన్న అన్న చందంగా గత ప్రభుత్వాలు పాలించాయని ఎద్దేవా చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దని పక్క రాష్ట్రాల ప్రజలు తెలంగాణ పథకాలు కావాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా కేసీఆర్‌కు వస్తున్న ఆదరణ చూసి విపక్షాలు భయపడుతున్నాయని తెలంగాణలోని అన్ని అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుస్తారని విపక్షాల విషయంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం చెక్కులు తీసుకున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు.



సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెన్షనర్లపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ర్యాలీగా తరలివచ్చి ధర్నాకు దిగారు. ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. పీఆర్‌సీ కమిషన్ వేయకుండా కాలయాపన చేస్తున్నారని పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. కేవలం ఒకే డీఏ చెల్లించి మూడింటిని పెండింగ్‌లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు వెల్‌నెస్ సెంటర్ ద్వారా సరైన వైద్యసేవలు అందించడంలేదని ఆరోపించారు. వైద్యులు ఉండడం లేదని, మందులు ఇవ్వడంలేదని మండిపడ్డారు. క్యాష్ రీయింబర్స్‌మెంట్ సైతం సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండడం కారణంగా కార్పొరేట్ వైద్యం అందడం లేదన్నారు. ఈ సమస్యలన్నింటిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎండీఎం కార్మికుల బిల్లులు విడుదల చేయాలి

నవతెలంగాణ-కడెం

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాట్లాడారు. తొమ్మిది నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో మధ్యాహ్న భోజన కార్మికులకు పాఠశాలల్లో భోజన నిర్వహణ కష్టంగా మారిందన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పెరిగిన జీతాన్ని జూన్ మాసం నుండి అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

డీసీసీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ ప్రజా ఆదరణ పెరుగుతోందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్తలు రిజ్వాన్, షోయబ్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి అధ్యక్షుడు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను స్థానిక ఎమ్మెల్యే విస్మరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నగేష్, రాజు, సాదిక్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ వెనుకబాటుతనానికి ప్రతిపక్షాలే కారణం

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లా వెనుకబాటుతనానికి ప్రతిపక్షాలే కారణమని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించడానికి వచ్చిన ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల్లో జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతుందని తెలిపారు. దీనికి నిదర్శనం కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు, మండలాల, గ్రామపంచాయతీల ఏర్పాటన్నారు. పరిపాలన వికేంద్రీకరణతో వెనుకబాటు గురైన ఆసిఫాబాద్ లాంటి జిల్లాలు కూడా అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతున్నాయని తెలిపారు. జిల్లా అభివృద్ధికి ఎన్నో నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాల్సిన బాధ్యత జిల్లా ప్రజలపై ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు జిల్లాకు రానున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలు ఇవ్వడం ఒక చరిత్ర అని తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుంచి చూస్తున్న ఎదురుచూపులు విజయం దశకు చేరుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండేవిటల్, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, జడ్పీటీసీ నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ పాల్గొన్నారు.

